క్లుప్తంగా

సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ



తెనాలి: అనారోగ్యంతో బాధపడుతూ ఆరోగ్యశ్రీ పరిధిలో లేని వ్యాధుల చికిత్సకు వైద్య ఖర్చులు భరించలేని పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి వచ్చిన ఆర్థిక సాయాన్ని శుక్రవారం ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్యే సిఫార్సుతో నియోజకవర్గంలోని ముగ్గురు పేద రోగులకు మంజూరైన ఆర్థిక సాయం రూ.10.30 లక్షల చెక్కులను ఆయన తన కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు పిల్లి ఉమా ప్రణతి, ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు, కౌన్సిలరు షేక్ దుబాయ్‌బాబు, రాష్ట్ర జలవనరుల కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, పార్టీ నాయకులు తాడిబోయిన రమేష్, అక్కిదాసు కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

దత్తగాన లహరి పుస్తకావిష్కరణ

తెనాలిటౌన్: రూరల్ మండలం అంగలకుదురు గ్రామంలో ఇటీవల మృతి చెందిన సాహితీవేత్త, కవి రావినూతల శ్రీరామమూర్తి గృహంలో శుక్రవారం ఆయన రచించిన దత్తగానలహరి పుస్తకాన్ని కుర్తాళం పీఠాధిపతి శ్రీ సిద్ధేశ్వరానంద భారతీస్వామి ఆవిష్కరించారు. శ్రీరామమూర్తి కుమార్తె అన్నపూర్ణ ఆధ్వర్యంలో రమాదేవి స్వర కల్పనలో బాపట్లకు చెందిన వీఆర్ క్రియేటర్స్ చంద్రశేఖర్ రూపొందించిన వీడియోను స్వామిజీ ఆవిష్కరించి ఆశీర్వదించారు. కార్యక్రమంలో ప్రకాష్, అన్నపూర్ణ, కుటుంబ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



తెనాలిఅర్బన్: సార్వత్రిక ఎన్నికల విధుల్లో భాగంగా పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పరిశీలించారు. 24 నుంచి 31వ వార్డు పరిధిలోని కేంద్రాలను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో మంచినీరు, విద్యుత్ దీపాలు, టాయిలెట్స్, ఫ్యాన్‌లు ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ అధికారులు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

13న విజయవాడలో డాక్ అదాలత్



తెనాలి: జయవాడలోని పోస్టల్ రీజినల్ కార్యాలయంలో ఈ నెల 13న డాక్ అదాలత్ జరుగుతుందని తెనాలి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ సొంటి రవికిషోర్ శుక్రవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలియజేశారు. పోస్టల్ సేవలు అందుకోవటంలో ఏమైనా ఫిర్యాదులు ఉన్నట్లయితే విజయవాడలోని గాంధీనగర్‌లోని పోస్ట్ మాస్టర్ జనరల్, విజయవాడ రీజియన్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

విద్యార్థులు సేవాభావాన్ని కలిగి ఉండాలి

తెనాలిటౌన్: రూరల్ మండలం చావావారిపాలెం గ్రామంలో జేఎంజే మహిళా కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కె.అరుణ సుజాత, జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ జేవీ.సుధీర్‌కుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ షైనీలు శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్ సుధీర్ మాట్లాడుతూ విద్యార్థులు సేవాభావం కలిగి ఉండాలని మదర్ థెరిసాను ఆదర్శంగా తీసుకుని వాలంటీర్లు పనిచేయాలని సూచించారు. ప్రిన్సిపల్ షైనీ మాట్లాడుతూ గ్రామంలో శిబిరం ద్వారా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేసి గ్రామస్థుల నుంచి మన్ననలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రమేష్, కార్యదర్శి సాంబశివరావు, కిరణ్, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల ఆందోళన

తెనాలిటౌన్: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీచౌక్ సెంటర్లో శుక్రవారం కార్మికులు ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వైఎస్సార్ బీమా భవన నిర్మాణ కార్మికులందరికీ వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించి దాని ద్వారా అమలవుతున్న 15 పథకాలను తిరిగి ప్రవేశపెట్టాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ తెనాలి కార్యదర్శి శ్రీనివాసరావు, కరిముల్లా, మండల కార్యదర్శి హుస్సేన్‌వలీ, ముక్కంటి, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిఅర్బన్: ఈ నెల 3న జరగనున్న జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పిలుపునిచ్చారు. మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో శుక్రవారం పల్స్ పోలియోకు సంబంధించిన వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెనాలి నియోజకవర్గంలో అన్ని ప్రాంతాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. 0-5 సంవత్సరాల లోపు చిన్నారులందరూ పల్స్ పోలియో చుక్కలు వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బండి శేషన్న, అసిస్టెంట్ కమిషనర్ అనూష, కౌన్సిలర్ పేరం సంజీవరెడ్డి, మేనేజర్ అప్పలరాజు, ఆరోగ్యాధికారి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ఆంధ్రాప్యారిస్ మున్సిపల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో శంకర కంటి ఆసుపత్రి సహకారంతో శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రారంభించారు.కంటి వైద్యులు ఉద్యోగులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బండి శేషన్న, అసిస్టెంట్ కమిషనర్ అనూష, మేనేజర్ అప్పలరాజు, ఆరోగ్యాధికారి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, అసోసియేషన్ అధ్యక్షుడు ఆకురాతి రామచంద్రరావు, కార్యదర్శి కల్యాణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో జోరుగా పింఛన్ల పంపిణీ



చెంచుపేటలో పండుటాకు కోటేశ్వరమ్మకు పింఛన్ అందజేస్తున్న వాలంటీర్ రమాదేవి

తెనాలిఅర్బన్: వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమం తెనాలిలో శుక్రవారం ఉదయం ప్రారంభమైనది. వార్డు వాలంటీర్లు, సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీలు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు. రెండో వార్డులో వృద్ధాప్య పింఛన్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు ఇళ్ల వద్దకే పింఛన్లు పంపిణీ చేస్తుందని చెప్పారు. ఎంతో మందికి ప్రభుత్వం అందించే పింఛన్ ఆసరాగా నిలుస్తుందని అన్నారు. పట్టణంలోని అన్ని వార్డులలో పంపిణీ కార్యక్రమం కొనసాగింది.

సంక్షేమ పథకాల కొనసాగింపు జగనన్నతోనే సాధ్యం



19వ వార్డులో ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే సతీమణి పుష్ప

తెనాలిఅర్బన్: రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సతీమణి పుష్ప, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక కోరారు. 19వ వార్డులో అన్నాబత్తుని పుష్ప, 23వ వార్డులో చైర్‌పర్సన్ శుక్రవారం సాయంత్రం ఎన్నికల ప్రచారాలను నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమం, అభివృద్ధిని తెలియజేసి ఓట్లు అభ్యర్థించారు. 19వ వార్డులో కౌన్సిలర్ ఆవుల కోటయ్య, కోఆప్షన్ సభ్యుడు పెచ్చింగ్ సుభానీ, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. 23వ వార్డులో వైస్‌చైర్మన్ అత్తోట నాగవేణి, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రచారంలో పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తనయుడు అన్నాబత్తుని సత్యనారాయణ రూరల్ మండలం సోమసుందరపాలెం గ్రామంలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. సంక్షేమ పథకాల కరపత్రాలను ప్రజలకు ఆయన అందజేశారు.

ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు కన్వేయన్స్ డీడ్స్

4న పంపిణీ చేయనున్న ఎమ్మెల్యే శివకుమార్



బహిరంగ సభ ప్రదేశాన్ని, అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

తెనాలి: పట్టణ మున్సిపాలిటీ పరిధిలో ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్లు పూర్తి చేసి కన్వేయన్స్ డీడ్స్ పంపిణీకి రంగం సిద్ధమైంది. ఈనెల 4న స్థానిక తాలూకా హైస్కూల్ గ్రౌండ్‌లో జరిగే బహిరంగ సభలో లబ్ధిదారులకు ఈ పత్రాలను అందజేయనున్నారు. తొలిగా పట్టణంలోని 1-20 వార్డుల పరిధిలోని లబ్ధిదారులకు వీటిని పంపిణీ చేయనున్నట్టు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తెలియజేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, మున్సిపల్ అధికారులతో కలిసి శుక్రవారం మధ్యాహ్నం బహిరంగ సభ ప్రదేశాన్ని ఆయన పరిశీలించారు. అవసరమైన సూచనలను చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో గుంటూరు నగరం తర్వాత తెనాలి నియోజకవర్గంలోనే అత్యధికంగా పేదలకు ఇళ్లస్థలాల పట్టాలను పంపిణీ చేసిన విషయం తెలిసిందే. గతంలో ఎన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయిలో 27 వేల మంది పేదలకు ఇళ్ల స్థలాలను అందజేశారు. కేవలం తెనాలి పట్టణంలోనే 20 వేల మందికి పట్టాలను పంపిణీ చేశారు.

అక్రమ గ్యాస్ సిలెండర్ల గుట్టురట్టు



సిలెండర్లను స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ సిబ్బంది

నగరంపాలెం: అక్రమ గ్యాస్ సిలెండర్లను విక్రయిస్తున్న ముగ్గురిపై విజిలెన్స్ అధికారులు కేసులు నమోదు చేశారు. వారి నుంచి 56 సిలెండర్లను స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గుంటూరు రీజినల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కె.ఈశ్వరరావు ఆదేశాల మేరకు శుక్రవారం గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని కార్తికేయ హోటల్ వెనుక అక్రమంగా గ్యాస్ సిలెండర్లు నిల్వ చేసి, విక్రయిస్తున్నారనే సమాచారంతో సిబ్బంది తనిఖీలు చేపట్టారు. నిందితుల్లో ఒకరు ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలం గంగవరం గ్రామానికి చెందిన పొదర్తి కుమార్‌రాజాగా గుర్తించారు. అతను సబ్సిడీ సిలెండర్లలోని గ్యాస్‌ను వ్యాపార అవసరాలకు వాడే సిలెండర్లల్లోకి ఎక్కించేవాడు. అనంతరం వాటిని పులుగు రామకృష్ణ సాయంతో గుంటూరు బస్టాండ్ వద్దకు తరలించేవాడు. సిలెండర్లను చిచ్చుల సుబ్బారావు (ఋషి వ్యాలీ అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్) సహకారంతో అవసరమైన హోటల్స్ నిర్వాహకులకు రూ.1,600 నుంచి రూ.1,650కు విక్రయించి, సొమ్ము చేసుకునేవారు. నిత్యావసర సరుకుల చట్టం ప్రకారం గ్యాస్‌తో ఉన్న 24 సిలెండర్లు, 32 ఖాళీ సిలెండర్లను సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. కుమార్‌రాజాతోపాటు రామకృష్ణ, సుబ్బారావుపై 6ఏ కేసు నమోదు చేయాలని పౌరసరఫరాల శాఖ ఉప తహసీల్దార్‌ను విజిలెన్స్ అధికారులు ఆదేశించారు. తనిఖీల్లో విజిలెన్స్ సీఐ ఎస్.శ్రీనివాసులురెడ్డి, పౌరసరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

వృద్ధుడి మృతిపై కేసు నమోదు



పట్నంబజారు : లాడ్జిలో పనిచేస్తున్న వృద్ధుడు మృతి చెందిన ఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట మంజు లాడ్జిలో కొన్ని సంవత్సరాలుగా జి.రామయ్య (60) పని చేస్తున్నాడు. అతడి వివరాలు ఎవరికీ తెలియదు. గత నెల 29న రాత్రి లాడ్జిలో పడుకున్న రామయ్య శుక్రవారం తెల్లవారుజామున ఎంతసేపటికీ లేవకపోవడంతో నిర్వాహకులు మృతి చెందినట్లు గుర్తించారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని శవాగారంలో భద్రపరిచారు. మృతుడి వివరాలు తెలిసిన వారు కొత్తపేట పీఎస్ ఎస్‌హెచ్‌ఓ అన్వర్ బాషా (8688831320), హెడ్ కానిస్టేబుల్ టి.వెంకటరాజు (8309229750) సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

పట్నంబజారు: వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగడిగుంట కోటిరెడ్డివారివీధికి చెందిన శోభి స్నేహలత (25)కు 2022లో వసంతరాయపురానికి చెందిన లాజరస్‌తో వివాహమైంది. నాటి నుంచి లాజరస్, అతని కుటుంబ సభ్యులు స్నేహలతను నిత్యం వేధింపులకు గురిచేసేవారు. దీంతో సంగడిగుంట ప్రాంతానికి కాపురాన్ని మార్చారు. అయినప్పటికీ నిత్యం డబ్బుల కోసం వేధింపులకు గురి చేస్తుండేవాడని మృతురాలి కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో భర్త వేధింపులు భరించలేక శుక్రవారం మధ్యాహ్నం స్నేహలత ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి గూడవల్లి ఏసు మరియమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

3న మహిళా దినోత్సవ వేడుకలు

తెనాలి: రానున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని రెయిన్‌బో ట్రస్ట్, రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి సంయుక్త నిర్వహణలో ఈనెల 3న విమెన్స్ డే సెలబ్రేషన్స్‌ను నిర్వహించనున్నారు. ఆ రోజు మధ్యాహ్నం 5 గంటల నుంచి స్థానిక ఎన్జీవో కల్యాణ మండపంలో జరిగే వేడుకల వివరాలను ట్రస్ట్ వ్యవస్థాపకురాలు డాక్టర్ డి.జీవనలత ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ వేడుకల్లో భాగంగా రుచికరమైన, ఆరోగ్యకరమైన వంటల పోటీలు నిర్వహించి విజేతలకు నగదు బహుమతులను అందజేస్తామని తెలిపారు. వ్యర్థ పదార్థాలతో ఇంట్లో అలంకరణ వస్తువుల తయారీపై మరో పోటీ ఉంటుందన్నారు. వీరికి సైతం నగదు బహుమతులు ఇస్తామన్నారు. వివిధ రంగాల్లో నిష్ణాతులైన మహిళామణులు ఉప్పాల రజనీదేవి (విద్య), డాక్టర్ డి.విజయమ్మ (వైద్యం), పెసర్లంక వసంతదుర్గ, షేక్ లలిత మనీషా (కళ), నాగం జ్ఞానదివ్య (క్రీడ), మాజేటి శారదాదేవి (ఆధ్యాత్మికం), తోటకూర గ్రేస్ విజయ (పోలీస్), కొండా ఉషారాణి (వ్యవసాయం), గండికోట పోలేరమ్మ (ఆర్టీసీ), నక్క నాగమణి (పారిశుద్ధ్యం)లను సత్కరించనున్నట్టు వివరించారు.

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా అనంతాచార్యులు

తెనాలిటౌన్: భారతీయ జనతా పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా తెనాలి పట్టణానికి చెందిన డాక్టర్ టి.అనంతాచార్యులు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు వనమ నరేంద్రకుమార్ నియామక ఉత్తర్వులను జారీ చేశారు. రాష్ట్ర ధార్మిక విభాగం కన్వీనర్‌గా, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా అనంతాచార్యులు గతంలో పని చేసినట్లు తెలిపారు. అనంతాచార్యులు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమలు చేస్తున్న వివిధ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశంతో పార్టీ ఈ బాధ్యతను తనకు అప్పగించినట్లు తెలిపారు. తన నియమకానికి కృషి చేసిన జిల్లా అధ్యక్షుడికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతాచార్యులు నియామకం పట్ల పార్టీ సీనియర్ నాయకులు యడ్లపాటి రఘునాథబాబు, యడ్లపాటి స్వరూపరాణి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాటిబండ్ల రామకృష్ణ, తెనాలి అసెంబ్లీ కన్వీనర్ కఠారి వాసుదేవ నాయుడు, పట్టణ అధ్యక్షుడు అడపా సంపత్ రాయుడు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ఓటు హక్కు వినియోగంపై కళాజాత

బాపట్ల: ఓటు వేద్దాం..ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేద్దాం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జన విజ్ఞాన వేదిక నాయకులు కోట వెంకటేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. దీనిపై ఈ నెల 3న బాపట్లలో కళాజాత ఆధ్వర్యంలో ప్రదర్శన ఉంటుందని కోట తెలిపారు. స్థానిక జనవిజ్ఞాన వేదిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో కోట వెంకటేశ్వరరెడ్డి మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఓటు విలువను తెలుసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు లింగం జయరాజు, పల్లపోలు నాగ మనోహర లోహియా, పి రాజ్ కుమార్, బక్క జయరామిరెడ్డి, బి ప్రతాప్, సుబ్బారావు, ఇస్సాకు, ఇ.రమణ పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు

తెనాలిరూరల్: నిబంధనలకు విరుద్ధంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణ గంగానమ్మపేటలోని ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి ఓ వ్యక్తి శుక్రవారం ఆరు క్వార్టరు సీసాలు కొనుగోలు చేసి వెళుతుండగా పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డాడు. సీసాలను స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు టూటౌన్ పోలీసులు తెలిపారు.

'అహ నా పెళ్లంట' షూటింగ్ ప్రారంభం

తెనాలి: ఆంధ్రా ప్యారిస్ తెనాలిలో కొత్తగా వెబ్ సిరీస్ షూటింగ్‌కు శ్రీకారం చుట్టారు. శ్రీశ్రీ మీడియా బ్యానర్‌పై మునిపల్లి శ్రీకాంత్ నిర్మాతగా ప్రొడక్షన్ నంబర్-1గా 'అహ నా పెళ్లంట' వెబ్ సిరీస్‌కు శుక్రవారం స్థానిక నాజరుపేటలో షూటింగ్ ప్రారంభించారు. దర్శకుడు కనపర్తి రత్నాకర్ ముఖ్య అతిథిగా హాజరై నటీ నటులపై క్లాప్ కొట్టారు. చిత్ర దర్శకుడు వెంకీ రావణ్ మాట్లాడుతూ ప్రేమ, వినోదంతో కూడుకున్న కథతో ఈ వెబ్ సిరీస్ ప్రేక్షకులను అలరిస్తుందని చెప్పారు.

రేషన్ బియ్యం స్వాధీనం

పట్నంబజారు: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పాత గుంటూరు పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం కొమెరపూడికి చెందిన ఎం.జగన్ సుబ్బారావు గుంటూరు పరిసర ప్రాంతాల్లో ప్రజల నుంచి రేషన్ బియ్యం కొనుగోలు చేసి తరలిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సుద్దపల్లి డొంక ప్రాంతంలో దాడి చేసి ఆటోలో తరలిస్తున్న మూడు టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓటు హక్కు వినియోగం అందరి బాధ్యత

తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్



ప్రఖర్‌జైన్

తెనాలి: సార్వత్రిక ఎన్నికలలో ఓటర్లుగా నమోదైన దివ్యాంగులు, సీనియర్ సిటిజన్లు తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెనాలి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్ సూచించారు. ఎన్నికల ఏర్పాట్లపై శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. తెనాలి నియోజకవర్గంలో 273 పోలింగ్ కేంద్రాలున్నట్టు వెల్లడించారు. వీటిన్నింటినీ సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, తెనాలి తహసీల్దార్ ఎస్.శ్రీనివాసరెడ్డితో కలిసి పరిశీలిస్తున్నట్టు చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో పరిశుభ్రత, శానిటేషన్‌లపై దృష్టిపెట్టినట్లు వివరించారు. గత జనవరి నెల 22న తుది ఓటరు జాబితాను ప్రకటించినట్టు ప్రఖర్‌జైన్ చెప్పారు. దివ్యాంగులు ఓటు నమోదు చేసుకొనేలా నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌కు తగిన ఫలితం లభించిందని చెప్పారు. మొదట్లో నియోజకవర్గంలో దివ్యాంగుల ఓట్లు కేవలం 1,998 మాత్రమే ఉండగా, ప్రత్యేక డ్రైవ్ నిర్వహించిన అనంతరం వీరి ఓట్లు 3,035కు పెరిగాయని తెలియజేశారు. దివ్యాంగులతో పాటు సీనియర్ సిటిజన్లు పోలింగ్ రోజున తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ప్రతి మండలంలోను ఒక మోడల్ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో రెండు మహిళా మోడల్ పోలింగ్ కేంద్రాలు, రెండు దివ్యాంగుల మోడల్ పోలింగ్ కేంద్రాలు అవసరమని చెప్పారు. ఆ ప్రకారం తెనాలి నియోజకవర్గంలో అవసరమైన మోడల్ కేంద్రాలను గుర్తిస్తామని వివరించారు.

తెనాలిని పారిశుద్ధ్య పట్టణంగా తీర్చిదిద్దుతాం

మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక



మురుగు కాల్వలను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రాధిక

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణాన్ని చెత్త రహిత ప్రాంతంగా తీర్చి దిద్దేందుకు కృషి చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. పట్టణంలోని రెండో వార్డులో శుక్రవారం ఆమె పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. చెత్త సేకరణను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అలాగే మురుగు కాల్వలను పరిశీలించి పారుదల సక్రమంగా జరిగే విధంగా చూడాలన్నారు. ఆమె వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, ఏఈ ఫణి, పలువురు మున్సిపల్ అధికారులు ఉన్నారు.

షిల్ట్ తొలగింపు

యడ్ల లింగయ్య కాలనీలోని రైల్వేట్రాక్ కింద ఉన్న మురుగు కాల్వలోని షిల్ట్‌ను చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక చొరవతో తొలగించారు. ట్రాక్ కింద షిల్ట్ పేరుకుపోయి ఆ ప్రాంత వాసులు ఇబ్బందులు పడుతున్న విషయం ఆమె దృష్టికి వచ్చింది. వెంటనే స్పందించిన చైర్‌పర్సన్ ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి నాలుగు రోజుల్లో షిల్ట్ తొలగింపు పనులు చేపట్టారు. దీంతో ఆ ప్రాంత వాసులు ఆమెకు కృతజ్ఞతలు తెలియజేశారు.

రక్తదానాన్ని ప్రోత్సహించండి

జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి



నాగరాజుకు సర్టిఫికేట్‌ను అందిస్తున్న సౌభాగ్యవాణి

తెనాలి: రక్తదానానికి ప్రజలు ముందుకొచ్చేలా స్వచ్ఛంద సంస్థలు, వివిధ సంఘాలు ప్రోత్సహించాలని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి సూచించారు. గర్భిణీలు, ప్రమాదాల్లో క్షతగాత్రులు, కిడ్నీ రోగులకు అవసరమైన రక్తం నిల్వల కోసం తమవంతు సాయంగా హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ముంబయి) కోస్తాంధ్ర అధ్యక్షుడు పల్నాటి నాగరాజు 40 యూనిట్ల రక్త దానానికి సహకరించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. శుక్రవారం తన కార్యాలయంలో నాగరాజుకు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి తరపున సర్టిఫికేట్‌ను అందజేశారు. మెడికల్ ఆఫీసర్ ఆర్.సందీప్, బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ ఎం.బాపనయ్య పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే బీసీ వర్గీయులు



మాట్లాడుతున్న వేణుగోపాల్‌గౌడ్

దావులూరు(కొల్లిపర): రాష్ట్రంలో బీసీ సామాజిక వర్గానికి చెందిన వారిలో అత్యధిక శాతం మంది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉన్నారని బీసీ సీనియర్ నాయకులు అద్దంకి వేణుగోపాల్ గౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని దావులూరు గ్రామంలో రానున్న ఎన్నికల నేపథ్యంలో బీసీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలంటేనే దేశానికి బ్యాక్ బోన్ లాంటి వారనీ బీసీ సదస్సులో ఇచ్చిన హామీలను సీఎం జగనన్న కార్యరూపంలోకి తీసుకొచ్చారన్నారు. సంక్షేమం, అభివృద్ధిలో సామాజిక న్యాయాన్ని పాటిస్తూ రాజ్యాధికారంలో బలహీల వర్గాలను భాగస్వాములను చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు.ఇప్పటికే రాష్ట్రాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో 30 ఏళ్లపాటు సీఎంగా కొనసాగితే రాష్ట్రం శతశాతం అభివృద్ధి చెందుతుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు, వివిధ గ్రామాల బీసీలు పాల్గొన్నారు.

ఆసరా సొమ్ము సత్వరం ఖాతాల్లో జమ చేయాలి



సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న డీఆర్‌డీఏ పీడీ కృష్ణ

డీఆర్‌డీఏ పీడీ సీహెచ్.కృష్ణ

కొల్లూరు : డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం విడుదల చేసిన 4వ విడత ఆసరా సొమ్మును వారి వ్యక్తిగత ఖాతాల్లో జమ అయ్యేలా వెలుగు సిబ్బంది తక్షణ చర్యలు చేపట్టాలని డీఆర్‌డీఏ పీడీ సీహెచ్.కృష్ణ ఆదేశించారు. శుక్రవారం కొల్లూరులోని మదర్ థెరీసా మండల సమాఖ్య కార్యాలయంలో నియోజకవర్గంలోని కొల్లూరు, అమృతలూరు, చుండూరు, వేమూరు మండలాల వెలుగు సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం నవరత్నాల పథకాల హామీలో భాగంగా డ్వాక్రా మహిళలకు విడుదల చేసిన ఆసరా పథకం నగదు బ్యాంకర్లతో మాట్లాడి ఈనెల 15లోపు లబ్ధిదారుల వ్యక్తిగత ఖాతాల్లో జమయ్యేలా చూడాలన్నారు. వెలుగు సిబ్బంది నిరంతరం బ్యాంకర్లను సమన్వయం చేసుకుంటూ మహిళల సొమ్ము ఖాతాల్లోకి జమ చేయించే బాధ్యత తీసుకోవాలన్నారు. అదే విధంగా నగదు బకాయిలున్న డ్వాక్రా సంఘాలను గుర్తించి తక్షణం వారి వద్ద నుంచి స్త్రీనిధి, ఉన్నతి ద్వారా పొందిన రుణాలను, లోన్ రుణాలను జమ చేయించాలన్నారు. ప్రస్తుతం బ్యాంక్ రుణం పొందడానికి అర్హత గల సంఘాలున్న పక్షంలో వెంటనే వారికి రుణాలు ఇప్పించాలని సూచించారు. పాడి గేదెల పెంపకంపై ఆసక్తి ఉన్న డ్వాక్రా మహిళలకు సీసీఎల్ (క్యాష్ క్రెడిట్ లిమిట్) విధానంలో బ్యాంకర్లతో చర్చించి రుణం ఇప్పించడం ద్వారా గేదెలు కొనుగోలు చేసి వారికి జీవనోపాధి ఏర్పాటు చేయడంపై వెలుగు సిబ్బంది దృష్టి సారించాలని ఆదేశించారు.